సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 13 । మార్చి । 2023



చురుగ్గా వారధి నిర్మాణం

కొల్లేరు ప్రజల చిరకాల స్వప్నం సర్కారు కాల్వపై కొల్లేటి పెద్దింట్లమ్మ వారధి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

-8లో ▶




యువతి మృతి

జంగారెడ్డిగూడెం మండలం పట్టిన్నపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భవ్య మణిదీపిక అనే యువతి మృతిచెందింది.

-8లో ▶

పౌష్టికాహారంగా మునగాకు

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా మునగాకును అంద జేసే ప్రక్రియ విజయవంతంగా సాగుతోంది.



-8లో

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించాలి

ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ



ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరుగునున్న నేపథ్యంలో ఎన్నికల విధులను తప్పక పాటించాలని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. ఎన్నికల నియమావళిని ఆయన వివరించారు.

- ప్రతి ఓటరు గుర్తింపు కార్డుతో పోలింగ్ కేంద్రానికి రావాలి.
- పోలింగ్ స్టేషన్‌లోనికి ఓటరు తప్ప అనుచరులు ఎవ్వరికీ అనుమతి లేదు.
- ఓటు హక్కు వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రం ప్రాంతం నుంచి బయటకు వెళ్లిపోవాలి.
- పోలింగ్ కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.
- పోలింగ్ కేంద్రం నుంచి 100 మీటర్లలోపు ఓటర్లు, ఇతరులు గుమిగూడి ఉండరాదు.
- పోలింగ్ స్టేషన్ పరిధిలో రాజకీయ పార్టీల ప్రచారాలు నిషేధం.
- ఓటర్లు తమ వాహనాలను పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల అవతల నిర్దేశిత ప్రాంతంలో పార్కింగ్ చేయాలి.
- పార్టీ గుర్తులు, జెండాలతో పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు లోనికి అనుమతి ఇవ్వరు.
- సాయంత్రం 4 గంటల అనంతరం పోలింగ్ కేంద్రంలోకి ఓటు వేసేందుకు అనుమతి లేదు.
- పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎన్నికల కమిషన్ నియమావళి ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు.

పర్యాటకానికి పూర్వ వైభవం



పర్యాటక అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లం పర్యాటక అతిథి గృహాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం పరిశీలించారు. పెదమల్లం పర్యాటక కేంద్రానికి పూర్వ వైభవంగా తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలన్నారు. విద్యుత్, మంచినీటి సదుపాయం, ఇతర మౌలిక వసతులను పునరుద్ధరించాలన్నారు. ఈ ప్రాంతంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి, పర్యాటకులకు ఆహ్లాదంతో పాటు చక్కటి ఆరోగ్య అలవాట్లు కలిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ, జిల్లా పర్యాటక అధికారి ఎం డీహెచ్ మెహర్‌రాజ్, రీజనల్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు, డీఈ సత్యనారాయణ, ఇన్‌చార్జి తహసీల్దార్ రాపాకల రాజ్యలక్ష్మి, టూరిజం మేనేజరు ఎస్.పట్టాభి పాల్గొన్నారు.

హార్మోనిస్ట్ దుర్గాప్రసాద్‌కు పురస్కారం



దుర్గాప్రసాద్‌ని సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లుకి చెందిన హార్మోనిస్ట్, పౌరాణిక నటుడు పీవీ దుర్గాప్రసాద్‌కి యువ కళా మిత్ర మండలి, హైదరాబాద్ భారత్ వికాస్ పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పౌరాణిక రంగస్థల దిగ్గజం కీర్తిశేషులు షణ్ముఖి ఆంజనేయరాజు అవార్డును ప్రదానం చేశారు. యువ కళా మిత్ర మండలి 30వ వార్షికోత్సవం సందర్భంగా తనకు అవార్డు అందించినట్టు దుర్గాప్రసాద్ ఆదివారం విలేకరులకు తెలిపారు. అనంతరం శ్రీకృష్ణ తులాభారం నాటకం ప్రదర్శించామని, తాను నారదుడు పాత్ర పోషించానన్నారు.

యథావిధిగా పోలీస్ స్పందన

సాక్షి, భీమవరం: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం పోలీసు స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామని ఎస్పీ రవిప్రకాష్ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు అందుబాటులో ఉంటానన్నారు.

'మా ఊరు తంగేడు పూలు' పుస్తకావిష్కరణ

కామవరపుకోట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆదివారం మా ఊరు తంగేడు పూలు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం ఇక్కడ తన బాల్యాన్ని గడిపిన రచయిత్రి కొంకేపూడి అనురాధ రచనలు ఆదర్శనీయమన్నారు. పలువురు వక్తలు అనురాధ రచనాచాతుర్యాన్ని అభినందించారు.

సంక్షేమ పథం.. జన నినాదం

ఈ జెండా.. పేదలకు అండ

- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- పెద్దెత్తున సంబరాలు.. సేవా కార్యక్రమాలు
- 12 ఏళ్లు.. ఎన్నో మైలురాళ్లు
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు..



తణుకులో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



భీమవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పేదలకు అండగా.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా.. రాష్ట్రాభివృద్ధి కోసం ఆవిర్భవించిన వైఎస్సార్ సీపీ 12 ఏళ్లు పూర్తిచేసుకుంది. ఆదివారం 13వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దెత్తున సంబరాలు జరుపుకున్నారు. పార్టీ పతాకాలను ఆవిష్కరించి కేక్ కటింగ్‌లు చేశారు. అలాగే రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

- భీమవరంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చేందుకే వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిందని, రాజకీయాల్లో విశ్వసనీయత, నమ్మకాన్ని పెంచుతూ సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గా నాగమల్లేశ్వరరావు (బాబు), ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, నరసాపురం పార్లమెంటరీ పార్టీ మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెంలో ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కార్యాలయంలో ఆయన తనయుడు విశాల్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.
- నరసాపురంలోని పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు.
- ఉండి నియోజకవర్గంలోని కాళ్ల మండలం పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు గోకరాజు రామరాజుతో కలిసి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. రాబోయే ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీ స్థానాలు గెలుపొందడం ఖాయమని పీవీఎల్ ధీమా వ్యక్తం చేశారు. జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, కార్పొరేషన్ల డైరెక్టర్లు జగ్గురోతి విజయ్, గులిపల్లి అచ్చారావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.
- ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ, పోడూరు, పెనుమంట్ర మండలాల్లో ఎంపీపీలు పూతినీడి పెద్ద, సబ్బితి సుమంగళి, కర్రి వాసిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పార్టీ జెండాలను ఆవిష్కరించి కేక్ కటింగ్‌లు నిర్వహించారు. జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, కర్రి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, నాయకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్రంలో నిస్వార్థ పాలన: మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ప్రజలకు నిస్వార్థ సుపరిపాలన అందించాలనే ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తూ యావత్ దేశాన్ని ఇటుగా చూసేలా పాలన సాగిస్తున్నారన్నారు. బడుగు, బలహీన, పేద వర్గాలకు అండగా నిలబడి వారి శ్రేయస్సుకు కృషిచేస్తున్నారన్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. పార్టీ శ్రేణులు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని రోగులు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ప్రేమాన్విత మానసిక పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు భోజన వసతి కల్పించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పెదఅమిరంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ ఆధ్వర్యంలో..



పాలకొల్లులో నినాదాలు చేస్తున్న నాయకులు



నరసాపురం పార్టీ కార్యాలయంలో వేడుకలు



తాడేపల్లిగూడెంలో కేక్ తినిపిస్తున్న కొట్టు విశాల్



పెనుమంట్రలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

నూతన డిజైన్లతో లేసుకు మనుగడ

కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం రూరల్: నూతన డిజైన్లతోనే లేసు అల్లికలకు మనుగడ ఉందని ఆ దిశగా ప్రయత్నించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని సీతారాంపురం లేసు పార్కును ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఫుట్‌వేర్ డిజైన్ డెవలప్‌మెంట్ (ఎఫ్‌డీడీ) విద్యార్థులు, మోడల్స్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన డిజైన్లను లేసు అల్లికా మహిళలు నేర్చుకుంటేనే పోటీని తట్టుకోగలమన్నారు. ఎగ్జిబిషన్లకు హాజరయ్యే లేసు అల్లిక మహిళలు విక్రయ మెలకువలు తెలుసుకోవాలన్నారు. ఎగుమతితో పాటు స్థానికంగా ఉపయోగించే ఉత్పత్తులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. లేసు ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, లేసు పార్కు మేనేజర్ వెంకటేశ్వరరావు, లేసు పార్కు అధ్యక్షురాలు పులపర్తి మహాలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కొనసాగిన శిక్షణ

తాడేపల్లిగూడెం: అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమంలో భాగంగా బంగ్లాదేశ్ మహిళలు, అధికారుల బృందానికి వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో ఆదివారం ప్రత్యేక శిక్షణనిచ్చారు. దోమల వికర్షకాలు, అగరబత్తీల తయారీ, ధూప్ స్టిక్స్, మాయిశ్చరైజర్లు, మోజిటోస్, పూలు తేనెటీగల మైనం, తేనె సహాయంతో ఎలా చేయాలో వివరించారు. పూల సాయంతో టీలు, రోజ్ వాటర్ ఫేస్ ప్యాక్, మాస్కులు, సబ్బులు, పశువుల మేత, ఔషధాల తయారీపై అవగాహన కల్పించారు. పూలు, అలంకరణ మొక్కల నుంచి నూనె తీయడంపై వివరించారు. డాక్టర్ ఏవీడీ దొరాజీరావు, డాక్టర్ ఎస్.ఇమాన్యుయేల్, డాక్టర్ ఈ.కరుణశ్రీ, డాక్టర్ పి.సుశీల, డాక్టర్ ఎం.మాధవి, డాక్టర్ ఎ.దేవీవరప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న బంగ్లా మహిళలు

99 శాతం ఈకేవైసీ పూర్తి

సాక్షి, భీమవరం: జిల్లాలో దాళ్వా వరిసాగు చేస్తున్న 2,16,650 ఎకరాల్లో ప్రస్తుత సీజన్‌కు ఈక్రాప్ నమోదు పూర్తయ్యిందని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. అలాగే 99 శాతం మేర రైతులకు ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ క్రాప్ నమోదు జాబితాను 17వ తేదీ వరకూ ప్రదర్శిస్తామన్నారు. రైతుల వివరాలను తెలియజేసి అభ్యంతరాలు స్వీకరించాలని ఆర్‌బీకే సిబ్బందికి ఆయన సూచించారు.

● 'గుత్తుల' పనస



పనస కాయలు గుత్తులుగా కాసి అబ్బురపరుస్తున్నాయి. సాధారణంగా ప్రధాన కాండానికి వరుస క్రమంలో కాయలు కాస్తుంటాయి. అయితే తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ యార్డులోని చెట్టులోని ఒకే భాగంలో గుత్తులుగా కాసి ఆకట్టుకుంటున్నాయి. సుమారు 20 కాయల వరకూ గుత్తుగా కాయడం విశేషం.

- తాడేపల్లిగూడెం రూరల్

నేడే ఎమ్మెల్సీ పోలింగ్

- రెండు స్థానాలు.. 1,105 మంది ఓటర్లు
- ఉమ్మడి పశ్చిమలో 5 పోలింగ్ కేంద్రాలు
- కేంద్రాలకు తరలిన ఎన్నికల సామగ్రి
- అధికార పార్టీ అభ్యర్థులుగా కవురు, వంక
- పూర్తయిన ఏర్పాట్లు



ఏలూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎన్నికల సామాగ్రిని పరిశీలిస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఏలూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రెవెన్యూ యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసి పోలింగ్ సామగ్రిని కేంద్రాలకు తరలించగా పోలీస్ యంత్రాంగం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలులోకి తెచ్చి ఆదివారం సాయంత్రం నుంచే ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు సబ్ డివిజన్లలో ఐదు పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. జిల్లావ్యాప్తంగా 1,105 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, పశ్చిమగోదావరి ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ ఏలూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎన్నికల సామగ్రి తరలింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

అధికారులు ఇలా..

ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్, వెబ్‌కాస్టర్ విధుల్లో ఉంటారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి స్థానిక ఎంపీడీఓలు, కమిషనర్లు ధ్రువీకరించి పంపుతారు. 477 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధులకు కేటాయించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా..

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఆర్వో కె.కృష్ణవేణి తెలిపారు. భీమవరం మండలపరిషత్ కార్యాలయంలో పోలింగ్ బూత్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు. నరసాపురం, భీమవరం కేంద్రాల్లో ఆరుగురు సిబ్బందిని ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలో ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశామని ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా చర్యలు చేపట్టామన్నారు.





సూచనలు ఇస్తున్న జేసీలు అరుణ్‌బాబు, సూర్యతేజ, సామగ్రితో కేంద్రాలకు వెళుతున్న ఎన్నికల సిబ్బంది

బరిలో ఆరుగురు అభ్యర్థులు

ఉమ్మడి జిల్లాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఆరుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. అధికార వైఎస్సార్ సీపీ నుంచి జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, పార్టీ ముఖ్యనేత వంక రవీంద్రనాథ్ పోటీలో ఉండగా మిగిలిన వారు స్వతంత్ర అభ్యర్థులు. కనీస ఓటింగ్ మద్దతు లేని కారణంగా ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు దూరంగా ఉంది. అయితే జిల్లాలో టీడీపీ నేతలు కొందరు అత్యుత్సాహంతో గ్రామ, మండల స్థాయి నాయకులను స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిపారు.

16న కౌంటింగ్

ఓట్లను 16న కౌంటింగ్ చేసి ఫలితాలను ప్రకటిస్తారు. జిల్లాలో మొత్తం 1,105 మంది ఓటర్లు ఉండగా వీరిలో 857 మంది ఎంపీటీసీలు, 48 మంది జెడ్పీటీసీలు, 180 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, 21 మంది ఎక్స్-అఫీషియో సభ్యులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

ఐదు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో.. ఏలూరు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, భీమడోలు, చింతలపూడి, దెందులూరు, ఏలూరు, గణపవరం, లింగపాలెం, నిడమర్రు, పెదపాడు, పెదవేగి, ఉంగుటూరు మండలాల పరిధిలోని 249 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.
- జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో.. బుట్టాయగూడెం, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కామవరపుకోట, కొయ్యలగూడెం, కుక్కునూరు, పోలవరం, టి.నర్సాపురం, వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీ, మండలాల పరిధిలోని 184 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.
- నరసాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఆచంట, యలమంచిలి, ఇరగవరం, మొగల్తూరు, పాలకొల్లు, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, తణుకు మండలాలు, నరసాపురం మున్సిపాల్టీలోని 229 మంది సభ్యులు ఓటు వేయనున్నారు.
- భీమవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఆకివీడు, అత్తిలి, భీమవరం, కాళ్ల, పాలకోడేరు, పెంటపాడు, తాడేపల్లిగూడెం, ఉండి, వీరవాసరం, ఆకివీడు నగర పంచాయతీలోని 201 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.
- కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో చాగల్లు, దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి, తాళ్లపూడి, ఉండ్రాజవరం మండలాలు, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీ పరిధిలోని 242 మంది ఓటర్లు ఓటు వేయనున్నారు.

క్లుప్తంగా

చిన వెంకన్న సేవలో రాజేంద్రప్రసాద్



శ్రీవారి ఆలయంలో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహిస్తున్న సినీ నటుడు రాజేంద్రప్రసాద్

ద్వారకాతిరుమల: వారసుడు పుట్టాడన్న ఆనందంతో తాను శ్రీవారి క్షేత్రాన్ని సందర్శించినట్లు సినీ నటుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని కుటుంబ సమేతంగా ఆదివారం ఆయన సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తర్వాత ఆలయ ఏఈఓ ఎం.దుర్గారావు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తన కుమారుడు బాలాజీకి బాబు పుట్టాడని, వారసుడొచ్చిన సందర్భంగా తాము స్వామివారి చెంతకు వచ్చినట్టు చెప్పారు. అనంతరం పలువురు అభిమానులు ఆయనతో ఫోటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పోలవరం రూరల్ : పోలవరం మండలం ఎల్ఎన్డీపేట గ్రామానికి చెందిన బి.లక్ష్మీనారాయణ కనబడటం లేదని భార్య దివ్యవాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు.

పౌష్టికాహారంగా మునగాకు

అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ



ఆకివీడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. అందులో భాగంగా మునగ చెట్ల ఆకుల్ని వారానికి రెండు రోజులు అందజేసే ప్రక్రియ విజయవంతగా నడుస్తోంది. మునగ ఆకు పప్పు, మునగ ఆకు రసం, లేదా కూర రూపంలో వారానికి రెండు రోజులు అందజేయడం ద్వారా వారికి పౌష్టికాహారం సమృద్ధిగా లభిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలలోని పెరటులో ఆకుకూరలు, మునగ మొక్కల్ని పెంచాలని ప్రభుత్వం సూచించింది.

మునగ ఆకులో ఐరన్, విటమిన్ ఏ, సీ, యాంటీ ఆక్సిడెంట్స్, కాల్షియం, అమినో యాసిడ్స్, ఫాస్పరస్, ప్రొటీన్లు, క్లోరోజెనిక్ యాసిడ్, నీరు, పిండి పదార్థాలు, ఫ్యాట్స్, మాంసకృతులు ఉన్నాయి. ఇలాంటి బలవర్ధక ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్నారు. మునగ రక్త హీనతను, కంటి చూపును తొలగిస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని అందిస్తుంది. గర్భిణీల్లో పిండం ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడుతుంది. ఎముకల పటుత్వంతో పాటు థైయిరాయిడ్‌ను తగ్గిస్తుంది. బాలింతల్లో పాల ఉత్పత్తిని పెంచుతుంది. సుఖ ప్రసవానికి సహకరిస్తుంది. ఆరోగ్యకరమైన కొవ్వును అందిస్తుంది. రక్తంలో సుగర్ స్థాయిల్ని తగ్గిస్తుంది. ఆస్తమా, టీబీ, పొడి దగ్గులు దరికి చేరనివ్వవు. మహిళలకు మునగాకు వరప్రదాయిని.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఒక వరం

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా వారంలో ప్రతి శుక్రవారం ముగన ఆకు, పప్పుకూర, మరో రెండు రోజులు బుధ, గురువారాల్లో ఆకుకూరల పప్పును అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నారు. జిల్లాలోని 1562 అంగన్‌వాడీ కేంద్రాల్లో 10,200 మంది గర్భిణులు, 8,400 మంది బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 71,600 మందికి మధ్యాహ్న భోజనం ద్వారా సంపూర్ణ పోషణ అందుతుంది.

మునగాకులో మంచి పోషకాలు



గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాలున్న ఆహారం అందజేస్తున్నాం. మునగ ఆకును పప్పు కూరగా ఒక రోజు ఇస్తున్నాం. మునగాకులో విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉన్నాయి. అపర సంజీవనిగా మునగాకును మన పూర్వీకుల నుంచి ఉపయోగిస్తున్నాము.

– సుజాతా రాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం

ఆకుకూరలతో పాటు మునగాకు



మా జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆకు కూరలతో పాటు అప్పుడప్పుడూ మునగ ఆకు కూర కూడా పెడుతున్నాం. మునగాకు తీసుకుంటే రక్తహీనత ఉండదు. ఎముకల పటుత్వం పెరుగుతుంది.

– శ్రీకాళహస్తేశ్వరుడు, ప్రధానోపాధ్యాయుడు, పెదకాపవరం, ఆకివీడు మండలం

మంత్రిని కలిసిన అథ్లెట్ జ్యోతిక శ్రీ



తణుకులో మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అథ్లెట్ జ్యోతిక శ్రీ

తణుకు అర్బన్ : జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణపతకం సాధించిన తణుకుకు చెందిన క్రీడాకారిణి దండి జ్యోతికశ్రీ ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 6వ తేదీన తిరువనంతపురంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలకు సంబంధించి 400 మీటర్ల విభాగంలో జ్యోతిక శ్రీ స్వర్ణపతకం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి జ్యోతికశ్రీని ఘనంగా సత్కరించి అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఖేలో ఇండియా గేమ్స్‌లో మూడో స్థానం



మూడో స్థానం సాధించిన టి.శిరీష

తాడేపల్లిగూడెం (టీఓసీ) : బెంగళూరులో ఆదివారం నిర్వహించిన ఖేలో ఇండియా గేమ్స్‌లో దక్షిణ భారతదేశ విభాగంలో 18 ఏళ్ల పైబడిన మహిళల విభాగంలో ట్రెడిషనల్ యోగాలో పశ్చిమ గోదావరి జిల్లా వాసి టి.శిరీష మూడో స్థానంలో నిలిచారు. ఆమెను యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఏపీ ప్రెసిడెంట్ ఎ.రాధిక, సెక్రటరీ అమిత్‌గోతి అభినందించారు.

విర్డ్‌లో లైవ్ శస్త్రచికిత్సలు



ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్న వైద్యులు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆసుపత్రిలో ఆదివారం ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అమెరికాకు చెందిన వైద్యులు కామినేని శ్రీనాథ్ పర్యవేక్షణలో ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఇందులో రాష్ట్రానికి చెందిన మొత్తం 40 మంది వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనాథ ఆధ్వర్యంలో వైద్య బృందం భుజం మోచేయి శస్త్రచికిత్సలను లైవ్ ద్వారా కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రదర్శించేలా నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో వైద్యులు భవ్యచంద్, నాగేంద్ర, హమీద్, సింధు, శ్రీనివాస్, బాలాజీ, విహారి తదితరులు పాల్గొన్నారు.

● కిటకిటలాడిన బీచ్



మండలంలో కేపీ పాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పాఠశాలలు, కాలేజీలకు సెలవు రోజు కావడంతో భారీగా తరలి వచ్చారు. వాతావరణం అహ్లాదకరంగా ఉండటంతో పాటు ఎండ ఎక్కువగా ఉండటంతో బీచ్‌కు వచ్చిన పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని ఆలయాలను దర్శించుకున్నారు.

– మొగల్తూరు

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి





ప్రమాద స్థలంలో మృతి చెందిన మణి దీపిక, భవ్య మణిదీపిక(ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం పట్టిన్నపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువతి అక్కడికక్కడే మృతి చెందింది. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన బిస్కెట్ల వ్యాపారి ముత్తా గంటారావు, అతని భార్య లక్ష్మీ కుమారి, కుమార్తె భవ్య మణి దీపిక(22) ఈనెల 11 వ తేదీ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై బుట్టాయిగూడెం మండలం రెడ్డిగణపవరంలో శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి వెళ్లారు. జాతర నుంచి తిరిగి అర్ధరాత్రి సమయంలో ఇంటి వస్తుండగా పట్టిన్నపాలెం వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో గంటారావు, లక్ష్మీ కుమారి ఒక పక్కకు పడగా, భవ్య మణి దీపిక రహదారిపై పడిపోయింది. అదే సమయంలో జనాలతో వస్తున్న ట్రాక్టర్ మణి దీపిక మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాద ఘటన విషయాన్ని తెలుసున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆదివారం భవ్య మణి దీపిక అంత్యక్రియలు నిర్వహించారు.

గడపగడపకు సంక్షేమం



కైకలూరు : కలిదిండి మండలం ఆరుతెగళపాడులో గడపగడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

బాల్య వివాహాన్ని అడ్డుకున్న తహసీల్దార్



లక్ష్మణేశ్వరంలో బాల్యవివాహాన్ని అడ్డుకుని మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్ : నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన బాలికకు వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తుండగా నరసాపురం తహసీల్దార్ ఫాజిల్, ఇతర అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో ఈ నెల 15న బాలికకు తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం ఓడరేవు గ్రామానికి చెందిన 22 సంవత్సరాల వయస్సు కలిగిన వరునితో వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని సమాచారం అందడంతో తహశీల్దార్ ఫాజిల్, రూరల్ ఎస్సై విశ్వనాథ్‌బాబు, ఐసీడీఎస్ అధికారులు వెళ్లి బాలిక తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. తొలుత వివాహ రద్దుకు అంగీకరించనప్పటికీ తహశీల్దార్, ఎస్సై మందలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారంతా అంగీకరించారు. వరుని కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు అక్కడి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ కృపరాజు, వీఆర్వో, పలువురు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదవేగి : ఆటో స్టీరింగ్ బాక్స్ పట్టేయడంతో అదుపుతప్పి బొల్తా పడిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జేపీ పేటకు చెందిన కొంతమంది ఆదివారం రాట్నాలకుంట దేవస్థానానికి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా జానంపేట పోలవరం కాలువ దాటాక.. వాహనం ఆటో స్టీరింగ్ బాక్స్ పట్టేసింది. దీంతో అదుపుతప్పి బొల్తా పడింది. ఈ ప్రమాదంలో మెరుపురెడ్డి నవీన్(19) అక్కడికక్కడే మృతిచెందగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఆసుపత్రిలో క్షతగాత్రులను ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్సై

రూ.75 వేల సరుకు చోరీ

మండవల్లి : మండవల్లి మండలం లోకుమూడి గ్రామానికి చెందిన లక్ష్మీపతుల రవికుమార్‌కు చెందిన జియోకేబుల్ నెట్‌వర్కులో దాదాపు రూ. 75 వేల విలువగల పనిముట్లు దొంగిలించినట్లు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రవికుమార్ మండవల్లి మండలంలో జియో కనెక్షన్‌లు వినియోగదారులకు అందజేస్తాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన మినీ వ్యాన్



తడికలపూడిలో ఇంట్లోకి దూసుకెళ్లిన వ్యాన్

కామవరపుకోట : అదుపుతప్పి మినీ వ్యాన్ ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటన మండలంలో తడికలపూడిలో ఆదివారం జరిగింది. స్థానికులు, తడికలపూడి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం ఉదయం స్నేహ ఫీడ్ కంపెనీకి చెందిన మినీ వ్యాన్ మేతతో హనుమాన్ జంక్షన్ నుంచి కామవరపుకోట మండలం కొల్లివారిగూడెం వెళ్తుండగా.. తడికలపూడి శివారు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి స్థానిక పెరవల్లి బ్రహ్మానందం ఇంటి ముందు భాగంలోకి దూసుకు వెళ్ళింది. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వటంతో తడికలపూడి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మండవల్లి: మండలంలోని గున్నసపూడి గ్రామానికి చెందిన యువతి గుడివాడ ఏఎన్నార్ కళాశాలలో టీటీసీ చదువుతుంది. ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెంటపాడు: పెంటపాడు కునాకరపేట వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. పెంటపాడు ఏఎస్సై ఉమామహేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం పిప్పర గ్రామానికి చెందిన ఉండ్రాజరపు చందుకిరణ్ (17) మోటార్‌సైకిల్‌పై పిప్పర నుంచి గూడెం మండలం జగన్నాథపురం బంధువుల ఇంటికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి శనివారం రాత్రి పిప్పర వెళుతుండగా కునాకరపేట వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో గాయాపడ్డ కిరణ్‌ను 108 అంబులెన్స్ ద్వారా గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ కిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు.

చురుగ్గా పెద్దింట్లమ్మ వారధి నిర్మాణం

80 శాతానికి చేరుకున్న పనులు





తుది నిర్మాణ దశకు చేరిన సర్కారు కాల్వ వద్ద పెద్దింట్లమ్మ వారధి, పనులను పరిశీలించడానికి వెళుతున్న ఆర్అండ్‌బీ డీఈ విజయ శ్రీఖర్

కైకలూరు : కొల్లేరు ప్రజల చిరకాల స్వప్నం సర్కారు కాల్వపై పెద్దింట్లమ్మ వారధి నిర్మాణం సాకారం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చొరవతో 80 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మే నెల చివరి నాటికి వారధి నిర్మాణం పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ అధికారి చెప్పారు. వారధి అందుబాటులోకి వస్తే ఏలూరు జిల్లాలో కొల్లేరు గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడటంతో పాటు పర్యాటకం పరుగులు పెడుతోంది. ప్రధానంగా రాష్ట్రంలో పేరుగడించిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం చేరడానికి నేరుగా బస్సు సౌకర్యం ఏర్పడుతుంది. పెద్దింట్లమ్మ వారధి పూర్వ చరిత్రను చూస్తే 1991లో ముఖ్యమంత్రి నేదురుమిల్లి జనార్దనరెడ్డి పందిరిపల్లిగూడెం వద్ద వారధి నిర్మాణానికి రూ.1.50 కోట్లతో శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పిల్లర్లు మాత్రమే వేసి నిధులు చాలవని వదిలిపెట్టేశాడు. 1992లో నిధులను రూ.2.50 కోట్లకు పెంచారు. తర్వాత కోర్టు వివాదంతో పనులు నిలిచాయి. తిరిగి 2004 నవంబరు 24న అప్పటి ఆర్అండ్‌బీ శాఖామంత్రి మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు రూ.7 కోట్ల నిధులతో మరోసారి శంకుస్థాపన చేశారు. పెరిగిన ధరలకు నిధులు చాలవంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో వారధి నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేశారు. ఆయన మరణంతో పనులు నిలిచాయి.

జగన్ రాకతో కదలిక

గత ప్రభుత్వం వారధి నిర్మాణ అంచనాలు పెంచి రూ.14.70 కోట్లుగా నిర్ణయించింది. 10 అడుగుల వెడల్పు, 205 మీటర్ల పొడవుతో 12 ఖానాలుగా వారధి నిర్మాణం చేపట్టాలని డిజైన్ రూపొందించింది. టీడీపీ ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేయడంతో నిర్మాణం కోసం తీసుకొచ్చిన ఇనుప సామాగ్రి తుప్పుపట్టింది. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) వారధి నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడంతో రూ.5 కోట్లు గత ప్రభుత్వంలో బకాయిలు నిమిత్తం మంజూరయ్యాయి. ప్రభుత్వం వారధి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు చకచకా పూర్తవుతున్నాయి.

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నుంచి కైకలూరు మీదుగా ఏలూరు చేరడానికి 40 కిలో మీటర్ల దూరం. అదే పెద్దింట్లమ్మ వారధి నిర్మాణం జరిగితే కైకలూరు రాకుండా ఆకివీడు వయా కొల్లేటికోట మీదుగా ఏలూరు చేరుకోవచ్చు. దీంతో 10 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. కొల్లేటికోట నుంచి పైడిచింతపాడు, మల్లవరం, కొక్కిరాయిలంక, గుడివాకలంక చాటపర్రు మీదుగా ఏలూరు చేరుకోవచ్చు. ఇదే కాకుండా మల్లవరం నుంచి వయా చెట్టుంపాడు, ఆగడాలంక నుంచి గుండుగొలును హైవేకు చేరుకుని ఏలూరు – ద్వారకా తిరుమల, రాజమండ్రి వెళ్ళే అవకాశం ఏర్పడుతుంది. పెద్దింట్లమ్మ దేవస్థానంకు వచ్చే భక్తులకు ప్రయాణం సులభతరం అవుతుంది. అదే విధంగా వారధి నిర్మాణంతో కొల్లేరు టూరిస్టు సర్కిల్ ఏర్పడుతుంది.

కొల్లేరు ప్రజలపై ప్రత్యేక దృష్టి



కొల్లేరు ప్రజల సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కొల్లేరు ప్రజల చిరకాల వాంచ పెద్దింట్లమ్మ వారధి నిర్మాణం త్వరలో తీరనుంది. వారధి నిర్మాణ పనులు దాదాపు పూర్తి దశకు చేరాయి. కొల్లేరు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్ని సీఎం నెరవేస్తున్నారు. అదే విధంగా కొల్లేరుకు సముద్రపు ఉప్పునీరు చేరకుండా రెగ్యులేటర్ల నిర్మాణ పనులకు త్వరలో సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

– దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్యే

మే నెలాఖరు నాటికి పూర్తి



పెద్దింట్లమ్మ వారధి నిర్మాణానికి ప్రభుత్వ ప్రోత్సహంతో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కృషి చేశారు. మే నెలాఖరు నాటికి వారధి నిర్మాణ పనులు పూర్తవుతాయి. అదే విధంగా గోకర్ణపురం నుంచి పెద్దింట్లమ్మ వారధి వరకు మట్టి రోడ్డును తారు రోడ్డుగా మార్పు చేస్తున్నాం. వారిధి నిర్మాణంతో కొల్లేరు గ్రామాలకు మరింత రహదారి సౌకర్యాలు ఏర్పడతాయి.

– సీహెచ్.విజయశ్రీఖర్, ఆర్అండ్‌బీ డీఈ, కైకలూరు

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సంచార వైద్యశాల ద్వారా 15 మందికి సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో 15 మందికి ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్యశాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ బొండాడ వెంకటేశ్వర్లు తణుకు పాతూరు, తణుకు పట్టణం, పైడిప్రు గ్రామాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వారికి ఇంటివద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సంఘ సభ్యుడు అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో అందించిన మందులను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

బలుసులమ్మ ఆలయంలో రాట మహోత్సవం


బలుసులమ్మ ఆలయం వద్ద రాట మహోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ తల్లి ఆలయంలో ఉగాది సందర్భంగా ఆదివారం విఘ్నేశ్వరపూజ, అనంతరం రాట మహోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, వైస్ చైర్మన్ వట్టిపోలు రాము, పెదప్రోలు భాస్కర్, నున్న రంగనాథ్, జి.రామస్వామి, రాంప్రసాద్, కుమార్, ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ తదితరులు పూజలు నిర్వహించారు.

అభయ గణపతికి అభిషేకాలు


గరికపూజతో గణపతికి విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని రామచంద్రరావుపేటలో గల శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో అభయ గణపతికి ఆదివారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గరికపూజ, పుష్పాలతో సహస్రనామార్చన చేశారు. భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఇందుకూరి మోహన్‌రాజు పూజలను పర్యవేక్షించారు.

15న సిలువ ప్రభావ వెల్లువ

పెంటపాడు: క్రీస్తు సిలువ శ్రమదినాలను పురస్కరించుకుని ప్రత్యేకంగా ప్రత్తిపాడు పద్మావతి కాలనీలో ఈనెల 15న క్రీస్తు సిలువ ప్రభావ వెల్లువ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బైబిలు మిషను సభ్యులు ఎం.డేవిడ్‌పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించే ఈ సమావేశానికి గుంటూరుకు చెందిన బైబిలు మిషను ప్రెసిడెంట్ డాక్టర్ జె.శామ్యేల్‌కిరణ్‌తో పాటు, మిషన్ ఉన్నతాధికారులు, పాలకవర్గసభ్యులు హాజరవుతారన్నారు. పరిసర గ్రామాల విశ్వాసులు పాల్గొనాలని ఈ సందర్భంగా డేవిడ్‌పాల్ కోరారు.

నేటి నుంచి సువార్త సభలు

పెంటపాడు: రావిపాడు గ్రామంలోని షారోను మందిర ఆవరణలో బైబిలు మిషను సువార్త సభలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సంఘ కాపరి సబ్బితి సత్యానందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుత్తికి చెందిన బైబిలుమిషను నాయకులు అద్భుత కుమార్, పట్టింపాలెంకు చెందిన ఎస్ఎస్ భూషణం, ఏలూరుకు చెందిన జాన్‌వెస్లీ తదితరులు పాల్గొంటారన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 7 గంటలకు నిర్వహించే ఈ సమావేశాలను పరిసర గ్రామాల విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాడిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: అన్యాయంగా కొట్టి గాయపరిచాడని వ్యక్తి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నరసింహపురంలోని రాజుల కాలనీలో పాక జాన్ నివాసముంటున్నాడు. సాయంకాలం ఇంటి సామగ్రి తీసుకువెళ్లడానికి ఇంట్లోకి వెళుతుండగా పొరుగున ఉన్న బొక్కా కృష్ణ దుర్భాషలాడుతూ అన్యాయంగా కొట్టి గాయపరిచాడు. ఈ మేరకు బాధితుడు పాక జాన్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాకీ తీర్చాలని అడిగితే..

భీమవరం అర్బన్: పాత గొడవలను పురస్కరించుకుని ఆదివారం ఇద్దరి మధ్య గొడవ జరిగి ఘర్షణకు దారి తీయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన రామాని రమేష్‌కు అదే గ్రామానికి చెందిన తిలకలపూడి శ్రీనివాస్ నగదు బాకీ పడ్డాడు. వీరిద్దరికి గతంలో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రామాని రమేష్ డబ్బులు ఇవ్వాలని తిలకలపూడి శ్రీనివాస్‌ను అడగ్గా దుర్భాషలాడి తనను, తన భార్యను చంపేస్తానని బెదిరిస్తున్నాడని రామాని రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రేలంగిలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు


అత్తిలిలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పోలవరం ప్రాజెక్టుకు వైఎస్సార్ పేరు పెట్టాలి

- నినదించిన వైఎస్సార్ సీపీ నాయకులు
- ఊరూరా ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

పెంటపాడు: త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తి కానున్న పోలవరం ప్రాజెక్టుకు వైఎస్సార్ పేరును పెట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, ఎంపీపీ దాసరి హైమావతి కోరారు. వైఎస్సార్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటపాడులో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, తాడేపల్లి ఈశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వృద్ధులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఎన్ని అవమానాలు ఎదురైనా అధికారం లేకపోయినా తట్టుకుని నిలబడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పార్టీకి ప్రతి ఒక్కరూ విధేయులై ఉండాలన్నారు. రాబోయే ఎన్నికలలో నూరుశాతం విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. మండల యూత్ అధ్యక్షులు కొవ్వూరి విజయభాస్కరరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ మాట్లాడుతూ గాలివాటు ఉన్న పార్టీలు ప్రజలలో ఎన్నటికి నిలవలేవన్నారు. సిద్ధాంతాలకు విలువలు ఇవ్వని పార్టీలు మట్టిలో కలిసిపోవడం ఖాయమన్నారు. పెంటపాడు ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ప్రమాదంలో పడకుండా పార్టీ ద్వారా ప్రత్యేక మ్యానిఫెస్టో రూపొందించి అధికారంలోకి రాగానే దానిని ఒక మతగ్రంథంగా భావించి ముఖ్యమంత్రి జగనన్న అమలు చేయడం గర్వకారణమన్నారు. సంక్షేమ పాలనను అందిస్తూ ఇతర పార్టీలకు దిక్సూచీలా జగనన్న ఉన్నారన్నారు. ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి బాబి తదితరులు మాట్లాడారు. బేతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండ్రాజవరపు గోపి, చదలవాడ శ్రీను, తాడేపల్లి ప్రేమ్‌కుమార్, వార్డు సభ్యులు రెడ్డి శ్రీను, బర్ల జయరాంబాబు, కాసారపు శ్రీను, సత్తి ముత్యప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. రామచంద్రపురంలో చల్లా లింగమూర్తి, మీనవల్లూరులో చింతపల్లి శ్రీనివాసరావు, కోరుమిల్లిలో సర్పంచ్ వల్లూరి సత్యవతి, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు బ్రహ్మానందం, ప్రత్తిపాడులో వీర్ల గోవిందరావు, వీర్ల ధనరాజు, ముదునూరు గ్రామంలో బూరాడ శ్రీను, బుద్దన చంటి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి.

వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చారిత్రక ఘట్టం

తణుకు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం ఒక చారిత్రక ఘట్టమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాటి వీర్రాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని పీబీఆర్ గ్రౌండ్‌లో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల్పూరు సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, రెడ్డి హైమా, శేషుకుమారి, విజయదుర్గ, సుజాతలతో పాటు గ్రామ పంచాయితీ సభ్యులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల పార్టీ వైఎస్సార్ సీపీ

తాడేపల్లిగూడెం అర్బన్: పేదల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ ఆవిర్భించిన పార్టీ.. వైఎస్సార్ సీపీ అని యువనేత కొట్టు విశాల్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలను ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంచారు. అనంతరం కొట్టు విశాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిన పార్టీ పేదలకు అండగా నిలిచిందన్నారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన పేదలకు చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. రాష్ట్రాన్ని సుభిక్షంగా నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుండుబోగుల నాగు, బొడ్డు సాయి పాల్గొన్నారు.


పెంటపాడులో ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ సూర్యకళ, చిత్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు

జోరుగా సేవా కార్యక్రమాలు

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని రోగులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. అనంతరం సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ప్రేమాన్విత మానసిక పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షులు జంగం ఆనంద్‌కుమార్, తణుకు మండల అధ్యక్షులు పోలేపల్లి వెంకట ప్రసాద్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, సుద్దుల పాండు, మారిశెట్టి శివశంకర్, సప్పా బలరామ్, వావిలాల సరళాదేవి, ఉండవల్లి జానకి, నత్తా కృష్ణవేణి పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సుస్థిర పాలన

ఇరగవరం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇరగవరంలో జెడ్పీటీసీ సభ్యుడు పంపన అంజిబాబు దివ్యాంగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్నారన్నారు. మరో 30 ఏళ్లు సీఎంగా వైఎస్ జగన్ సుస్థిరపాలన అందిస్తారని, పార్టీ జెండా పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా రెపరెపలాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిడి నాగ వేంకట సత్యనారాయణ, కె.ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగర్జున, రేలంగి పార్టీ అధ్యక్షులు పులుపు అనిల్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, చోడే జోషి, వెలగల సాయిబాబారెడ్డి, సత్తి వెంకట రెడ్డి, గుడిమెట్ల సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, మామిడిశెట్టి శ్రీను, కడలి కుమార్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో మెరుగుపడ్డ ప్రజల జీవన ప్రమాణాలు

అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. వైఎస్సార్ సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేకును కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టి, తొలుత అనేక ఒడుదుడుకులు ఎదుర్కొని, అనంతరం అత్యధిక స్థానాలు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, మంచి పాలన అందిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరలా వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడానికి మనమంతా పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటా విజేతనాగరాజు, జిల్లా ప్రచార కార్యదర్శి పెన్మెత్స రామరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, మండలపార్టీ నాయకులు కందుల సత్యనారాయణ, శింగంశెట్టి శ్రీనివాస్, కాసగాని అబ్బులు, గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, సబ్బితి రాజేష్, యాళ్ల హనోక్‌కుమార్, గెడ్డంకుమారి, నిమ్మన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఇరగవరంలో దివ్యాంగురాలికి బ్రెడ్ అందిస్తున్న జెడ్పీటీసీ పంపన అంజిబాబు


అత్తిలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురవేస్తున్న మండల నాయకులు

అంజన్న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

తణుకు టౌన్: కొమరవరంలోని వాసవీనగర్‌లో నూతనంగా నిర్మించే పంచముఖ శ్రీఅభయ వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఇరగవరానికి చెందిన తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ రుద్ర ధనరాజు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, మండల పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్లు చిట్టూరి వెంకట సుబ్బారావు, ఉండవల్లి జానకి, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, రెడ్డి హైమా, శేషకుమారి, సుజాత, విజయదుర్గ, మలిరెడ్డి నాగార్జున, సూరంపూడి కామేష్, సర్పంచ్ కరిబండి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు పాల్గొన్నారు.


కొమరవరంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కారుమూరి

ఏవుళ్లమ్మ తల్లిని దర్శించిన మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు సజ్జాపురంలోని శ్రీఏవుళ్లమ్మ తల్లి జాతర మహోత్సవంలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర కమిటీ ఆధ్వర్యంలో మంత్రి కారుమూరికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూరిగుడిసెలో ఉన్న అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సజ్జాపురవాసుల ఇలవేలుపు ఏవుళ్లమ్మ తల్లి అందరిపైనా కరుణాకటాక్షాలు చూపించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, అడ్డగర్ల శివబాబు, నూకల కనకదుర్గ, వావిలాల సరళాదేవి, పైబోయిన ఏసు, జాతర కమిటీ నాయకులు కొమ్మిరెడ్డి వెంకన్న బాబూజీ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


శ్రీఏవుళ్లమ్మ తల్లి జాతర మహోత్సవానికి హాజరైన మంత్రి కారుమూరి

కొత్త భవనంలోకి పార్శిల్ ఆఫీస్ మార్పు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నూతనంగా నిర్మించిన సువిశాల భవనంలోకి ఆదివారం ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణమూర్తి, ఉమ్మడి జిల్లా కమర్షియల్ మేనేజర్ వి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పార్శిల్ ఆఫీస్‌ను షిఫ్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కస్టమర్లకు సౌకర్యవంతంగా నిర్మించిన ఈ భవనంలోకి కార్గో సేవలను షిఫ్ట్ చేసినట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో 120 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. సేవలను మరింతగా విస్తరిస్తామని బుక్ చేసిన 24 గంటలలోగా పార్శిల్ డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన భవన ప్రారంభం కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జి.మాధవరావు, కార్గో కాంట్రాక్టర్ అరుణా, డిపో సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.


కార్గో నూతన భవనం ప్రారంభిస్తున్న యేలూరి సత్యనారాయణమూర్తి, వి.నరసింహమూర్తి

శ్మశానవాటికలో చెత్త డంపింగ్ తగదు

పెంటపాడు: ఎస్సీలకు కేటాయించిన శ్మశానవాటికలోకి డంపింగ్ చేస్తున్న చెత్తను తక్షణం తొలగించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కళింగ లక్ష్మణరావు కోరారు. ఆదివారం మండలంలోని వల్లూరుపల్లి గ్రామ శ్మశానవాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎస్సీలకు కేటాయించిన ఐదు ఎకరాల శ్మశానవాటికకు హద్దులు నిర్ణయించి రెగ్యులర్ చేసి తక్షణం అప్పగించాలన్నారు. ఎస్సీలకు శ్మశానవాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలం ఒక వ్యక్తి ఆక్రమించాడని ఆరోపించారు. శ్మశానవాటికలో చెత్త డంపింగ్ చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని సర్వే చేయాలన్నారు. కేవీపీఎస్ నాయకులు మెరిపో జాన్‌రాజు, దళిత హక్కుల సంఘ కార్యదర్శి దిద్దే నాగేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉండ్రాజవరపు ప్రభాకర్, సిర్రా శ్రీను, బాదంపూడి శివాజీ, మార్లపూడి మహేష్, సురేష్, మల్లాది శ్రీరాములు పాల్గొన్నారు.

హెచ్3ఎన్2 వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండండి

పెంటపాడు: కోవిడ్ వైరస్ తరహాలోని హెచ్3ఎన్2 వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముదునూరు పీహెచ్‌సీ వైద్యుడు ఎస్వీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రకం వైరస్ కొన్ని చోట్ల వ్యాప్తి చెందుతోందన్నారు. దీని వల్ల గొంతునొప్పి, మూడు నుంచి ఐదు రోజుల పాటు జ్వరం, మూడు వారాల దగ్గు, చలి, వాంతులు, ముక్కు కారడం, కొద్దిమందిలో ఆయాసం లక్షణాలు ఉంటున్నాయన్నారు. హాండ్‌వాష్, ఫేస్‌మాస్కు, గుంపులకు దూరంగా ఉండటం, ఎక్కువ నీరు తాగాలని సూచించారు. వ్యాధి సోకకుండా మందులు వాడే సమయంలో డాక్టర్ సలహా తప్పక తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరూ విధిగా పాటించి హెచ్3ఎన్2 వైరస ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

హృద్రోగ వైద్య సేవలు అభినందనీయం

భీమవరం(ప్రకాశంచౌక్): ఉచిత హృద్రోగ వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ అన్నారు. ఆదివారం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో హైదరాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి గాయత్రి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గుండె వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో నిత్యం ఒత్తిడిగురవుతున్న నేపథ్యంలో వంశపారంపర్యంగా, జీవన విధానంలోనూ ఎందరో గుండె సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పేదలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జి.సుధీర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ కవిత వైద్య పరీక్షలు చేశారు. వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, కో-ఆర్డినేటర్ ఎంవీ రామరాజు, ఎస్ఎల్‌జీ ప్రతినిధి వై.రణదివె, విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సూర్యహోమం

పాలకొల్లు సెంట్రల్: ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో పట్టణంలో సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహిస్తున్న సూర్యహోమం ఆదివారం 146వ వారానికి చేరుకుంది. కోడిగట్టు సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం పురోహితులు రవీంద్ర బ్రహ్మత్వంలో సూర్యహోమం నిర్వహించారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ సూర్య హోమంలో పాల్గొనే భక్తులు పేర్లను నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు కేవీఎల్ నరసింహారావు కోరారు.

జూదరుల అరెస్ట్

పాలకోడేరు: పాలకోడేరులో పేకాడుతున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

నేటి నుంచి హోమాలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మందిరం నిర్మించి 12 ఏళ్లు అయిన సందర్భంగా సోమవారం నుంచి అద్భుత శాంతి అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈనెల 18వ తేదీ వరకు కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు తెలిపారు. ఇప్పటికే యాగశాలను నిర్మించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ లోకశాంతికోసం ఈ యాగం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు జానపాటి మధు, తాడికొండ కోటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, రాంప్రసాద్, కడలి వెంకటేశ్వరరావు భక్తులు పాల్గొన్నారు.